# కిరాతకం

- మాక్లూర్‌కు చెందిన ఒకే కుటుంబంలో ఆరుగురి హతం
- ఆర్థిక లావాదేవీల్లో భాగంగా స్నేహితుడి కుటుంబాన్ని పొట్టన పెట్టుకున్న హంతకుడు
- రెండు వారాల వ్యవధిలోనే ఒక్కొక్కరినీ హత్య చేసిన కిరాతకుడు
- మిస్సింగ్ కేసు కూపీ లాగితే బయటపడిన ఘాతుకం
- జల్సాలకు అలవాటుపడి మోసాలు చేసిన నిందితుడు ప్రశాంత్

నిజామాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / మాక్లూర్ : ఒకే కుటుంబంలో ఆరుగురిని అతి దారుణంగా చంపేసాడో కిరాతకుడు. 25 ఏండ్లు కూడా నిండని ప్రబుద్ధుడు అణ్యం పుణ్యం తెలియని పిల్లలను సైతం పొట్టన పెట్టుకున్నాడు. చిన్నారులకు బండరాళ్లు కట్టి నీళ్లలోకి విసిరేశాడు. ఏ పాపం తెలియని దివ్యాంగురాలిని కర్కషంగా పెట్రోల్ పోసి అంతమొందించాడు. కుటిల స్నేహం చేసి ముగ్గులోకి దించి, ఆస్తిని కాజేసేందుకు నడిపించిన తతంగంలో హంతకుడి తీరు ఒళ్లు గగుర్పొడిచే విధంగా కనిపిస్తుండడం చర్చనీయాంశం అవుతున్నది. సగం కాలిన ఓ మృతదేహంతో నిందితుడి గుట్టు రట్టు కాగా, ఆరుగురి హత్య విషయం బయటి ప్రపంచానికి తెలిసింది. చనిపోయిన వారిలో స్రవంతి మూడు నెలల క్రితమే మెట్టినింటి నుంచి తన సోదరుడు ప్రసాద్ చెంతకు వచ్చి కనిపించకుండా పోవడం దయనీయంగా మారింది. ఇప్పటి వరకు ముగ్గురి మృతదేహాలు లభ్యం కాగా మరో ముగ్గురి ఆచూకీ లేకుండా పోయింది. కిరాతక ప్రశాంత్.. తన క్రిమినల్ మైండ్‌తో ఎవరికీ అనుమానం రాకుండా అంతమొందించాడు. ఒకరికి తెలియకుండా మరొకరిని ఇంటి నుంచి బయటికి తీసుకెళ్లి ప్రాణాలు తీశాడు. డిసెంబర్ 13న యువతి హత్య కేసు కూపీ లాగి పోలీసులు హంతకుడి బండారం బయటకు తీశారు.

**హత్యల వెనుక కథ ఇదీ..**

పోలీసులు, మాక్లూర్ గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు ప్రశాంత్, హత్యకు గురైన రాచర్లకూన ప్రసాద్ కుటుంబానిది నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల కేంద్రం. ప్రసాద్ అనే వ్యక్తి ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లి రెండేండ్ల క్రితం సొంతూరికి తిరిగొచ్చాడు. గల్ఫ్‌లో ఉన్నప్పుడే ప్రసాద్ మూలంగా మోసపోయిన ఇదే గ్రామానికి చెందిన ఓ యువతి ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటనతో ప్రసాద్ కుటుంబం ఇల్లు వదిలి వేరే గ్రామంలో స్థిరపడింది. ప్రసాద్ తన పేరిట ఉన్న ఎకరం భూమిని యువతి కుటుంబానికి రాసిచ్చి ఈ వ్యవహారాన్ని ముగించుకున్నాడు. ఓ అమాయక యువతి ప్రాణాలను బలిగొన్న కారణంగా గ్రామంలో ప్రసాద్ కుటుంబంతో ఎవ్వరూ సత్సంబంధాలు పెట్టుకోకపోవడంతో కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి వెళ్లి తన కుటుంబంతో ప్రసాద్ బతుకుతున్నాడు. తన బతుకు తాను బతుకున్న సమయంలో స్వగ్రామం మాక్లూర్‌కు చెందిన ప్రశాంత్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. కుటుంబ పోషణకు అప్పు కోసం చూస్తున్న సమయంలో ప్రసాద్‌కు ప్రశాంత్ దగ్గరయ్యాడు. యువతి మృతి కేసులో నిందితుడిగా ఉన్నందున ఆస్తి బదలాయింపు కష్టం అవుతుందని చెప్పి తన పేరిట ఆస్తులు రాసిస్తే లోన్ ఇప్పిస్తానంటూ ప్రసాద్‌ను ప్రశాంత్ నమ్మబలికాడు. ఇదంతా నిజమేనని నమ్మి తన రెండు ఇండ్లను, ఒక ఫ్లాట్‌ను రాసిచ్చాడు. కొద్ది రోజులకు ప్రసాద్‌కు చెందిన ఒక ఇంటిని చెప్పా పెట్టకుండా వేరే వ్యక్తికి ప్రశాంత్ విక్రయించాడు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా తెలియడంతో ప్రశాంత్‌ను ప్రసాద్ నిలదీశాడు. ఇరువురు మధ్య కొద్ది కాలంలోనే మొదలైన స్నేహం కాస్తా తీవ్ర వైరంగా మారింది. ఇల్లు విక్రయానికి సంబంధించిన డబ్బును ఇవ్వాలని డిమాండ్ చేయడంతో తనకు రాజకీయ ప్రాబల్యం ఉందంటూ ప్రశాంత్ బెదిరింపులకు దిగాడు. వారం, పది రోజులుగా ఇరువురి మధ్య జరుగుతున్న జగడం ముదరడంతో ప్రసాద్‌ను, ఆయన కుటుంబాన్ని మట్టుబెట్టాలని ప్రశాంత్ నిర్ణయించుకున్నాడు. స్థిరాస్తికి సంబంధించి హక్కుదారులెవ్వ రూ ఉండకూడదని భావించి కుటుంబం మొత్తాన్ని మట్టుబెట్టాలని నిర్ణయానికి వచ్చి ఈ ఘాతుకానికి పాల్పడ్డట్లుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.



మాక్లూర్‌లో మృతుల ఇంటివద్ద గుమిగూడిన గ్రామస్తులు

## ఒక్కొక్కరినీ చంపేసి..

ఇలా సాగింది..

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారి 44కు ఐదు కిలో మీటర్ల దూరంలో డిసెంబర్ 14న హత్యకు గురైన దివ్యాంగురాలైన ఓ యువతి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. లైంగిక దాడి చేసి పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన ఈ ఘటనపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. చుట్టుపక్కల సీసీటీవీలను పరిశీలించగా ఒక అనుమానాస్పద కారును గుర్తించారు. ఈ కారు నంబర్‌తోపాటు సెల్‌ఫోన్ సిగ్నల్ డాటాను విశ్లేషించగా మాక్లూర్ మండలంలోని ప్రశాంత్ అనే యువకుడికి సంబంధించిన ఆనవాళ్లు బహిర్గతం అయ్యాయి. సదరు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నివ్వెరపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. నిందితుడు చెప్పిన వివరాల మేరకు డిచ్‌పల్లి హైవే పక్కన రాచర్లకూన ప్రసాద్‌ను మొదటగా హత్య చేసి పూడ్చిపెట్టాడు. ప్రసాద్ భార్య రమణిని బాసర వద్ద గోదావరిలో పడేశాడు. వీరి ఇద్దరు పిల్లలు చైత్, చైత్రను చంపి పోచంపాడ్ సోన్ బ్రిడ్జి వద్ద గోదావరిలో తోసేశాడు. అనంతరం ప్రసాద్, అతని భార్యను పోలీసులు అరెస్టు చేశారని నమ్మబలికి.. ప్రసాద్ ఇద్దరి చెల్లెళ్లు స్వప్న(దివ్యాంగురాలు), స్రవంతిలను వేర్వేరుగా హంతకులు చంపేశారు. ఇందులో స్వప్న మృతదేహం భూంపల్లి శివారులో దొరకడంతోనే ఈ ఘాతుకం వెలుగులోకి వచ్చింది. వరుసగా మొదటి మూడు హత్యలను ప్రశాంత్ ఒక్కడే చేసినట్లుగా తెలుస్తోంది. మిగిలిన హత్యలను ప్రశాంత్ సన్నిహితులైన మైనర్లు చేసినట్లుగా సమాచారం. హంతకులను కామారెడ్డి జిల్లా సదాశివనగర్ పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. త్వరలోనే పూర్తి వివరాలను పోలీసు ఉన్నతాధికారులు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

**నివ్వెర పోయిన మాక్లూర్...**

ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు హత్యకు గురి కావడంతో ఒక్కసారిగా మాక్లూర్ గ్రామం ఉలిక్కి పడింది. ప్రతి ఒక్కరూ ప్రసాద్ కుటుంబం మరణ వార్తను తెలుసుకుని నివ్వెర పోయారు. స్వగ్రామానికే చెందిన ప్రశాంత్ చేతిలో అన్యాయంగా హత్యకు గురైన ఘటనను తలచుకుని చాలా మంది ఆవేదన వ్యక్తం చేశారు. సీరియల్ కిల్లర్ ప్రశాంత్‌కు 25 ఏండ్లే అయినప్పటికీ గ్రామంలో అనేక మందిని భూ లావాదేవీల విషయంలో మోసగించాడు. అమాయకులను బుట్టలో వేసుకుని వారి పేరిట ఉన్న విలువైన భూమిని తన పేరు మీదకు బదలాయించుకుని, చాలా కాలంగా మోసాలకు పాల్పడ్డాడు. తీరా విషయం తెలుసుకుని ఎవరైనా నిలదీస్తే రాజకీయ నాయకుల పేరుతో బెదిరింపులకు పాల్పడడం మూలంగా ప్రజలంతా వెనకడుగు వేయాల్సి వచ్చింది. కిరాతకుడు ప్రశాంత్ చేతిలో ప్రసాద్ కుటుంబం బలి కావడంతో ఒక్కొక్కరుగా ప్రశాంత్ బాధితులు ముందుకు వచ్చి తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. గ్రామానికి చెందిన వారిని కిరాతకంగా హత్య చేసిన ప్రశాంత్ గతంలోనూ ఇలాంటి ఘటనలు చేసి ఉంటాడా ? అన్న అనుమానాలు సైతం బలంగా వినిపిస్తున్నాయి. సాదాసీదా కుటుంబానికి చెందిన ప్రశాంత్.. అనతి కాలంలోనే గుర్తింపు తెచ్చుకోవాలని తహతహలాడుతుండే వాడని గ్రామస్తులు చెప్పారు. మూడేండ్ల క్రితం కనీసం సైకిల్ కూడా లేని వ్యక్తికి కొత్త కార్లు రావడంతో అంతా అవాక్కయ్యారు. ఇందులో భాగంగానే సులువుగా డబ్బులు సంపాదించేందుకు ఈ మోసాలకు పాల్పడి, తద్వారా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తూ, కొత్త వాహనాలతో హల్‌చల్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించాడు. పూటకో వాహనాన్ని మార్చుకుంటూ జనాన్ని బుట్టలో వేసుకుని మోసాలు చేస్తుండగా అనేకసార్లు చివాట్లు తిన్నాడు. గ్రామంలో అసలు రంగు బట్టబయలు కావడంతో ప్రశాంత్ ఏమీ చేయలేక ఊరు వదిలి వెళ్లిన ప్రసాద్ కుటుంబాన్ని ఎంచుకుని హత్యలకు పాల్పడి తన నిజ స్వరూపాన్ని బయట పెట్టుకున్నాడు. ప్రశాంత్ వ్యవహారంపై లోతుగా విచారిస్తే మరికొన్ని ఉదంతాలు వెలుగు చూసే అవకాశం లేకపోలేదని మాక్లూర్ వాసులు పేర్కొంటున్నారు.

## సోన్ బ్రిడ్జి వద్ద మరో మృతదేహం..

మెండోరా, డిసెంబర్ 18 : జిల్లావ్యాప్తంగా సంచలనం రేపిన ఆరుగురి హత్య కేసులో మరో మృతదేహం మెండోరా మండలంలోని జిల్లా సరిహద్దు అయిన సోన్ బ్రిడ్జి వద్ద గోదావరి నదిలో సోమవారం లభ్యమయ్యింది. ఈ నెల 8న చయిత్ర మృతదేహాన్ని గుర్తించారు. పది రోజుల అనంతరం చయిత్ మృతదేహం లభ్యమైంది. దీంతో స్థానిక పోలీసులు, ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో క్లూస్ టీం, వైద్యసిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాలుడి మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో లభ్యమైందన్నారు. దీంతో మృతదేహాన్ని అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు.

## పది నెలల క్రితమే పాల్వంచకు వచ్చిన ప్రసాద్ కుటుంబం..

మాచారెడ్డి,డిసెంబర్ 18 : నిజామాబాద్ జిల్లా మాక్లూర్‌కు చెందిన ప్రసాద్ కుటుంబం పదినెలల క్రితమే పాల్వంచ గ్రామానికి వచ్చింది. భార్య, ఇద్దరు చెల్లెళ్లు, కూతురు, కుమారుడితో కలిసి వలస వచ్చాడు. భార్య బీడీలు చుట్టేదని, పెద్ద సోదరి దివ్యాంగురాలని, చిన్న సోదరి కామారెడ్డిలో పని చేసేదని స్థానికులు చెబుతున్నారు. ప్రసాద్ పాల్వంచలో మీసేవ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునే ప్రయత్నం చేశాడని, ప్రస్తుతం ఖాళీగా ఉటున్న ఆయన ఎన్నికల తర్వాత కనబడకుండా పోయాడని తెలిపారు. వారం రోజుల్లో కుటుంబ సభ్యులు ఒక్కొక్కరుగా కనిపించకుండా పోయినట్లు స్థానికులు తెలిపారు.

## ప్రశాంత్‌యాదవ్ బాధితులు మరెందరో..

మాక్లూర్, డిసెంబర్18 : నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన నిందితుడు ప్రశాంత్.. ప్రసాద్‌ను మోసం చేసిన మాదిరిగానే మరెందరినో మోసం చేశాడు. మాక్లూర్‌కు చెందిన నక్క లింగన్నకు 10 గుంటల పొలంపై అప్పు ఇప్పిస్తానని చెప్పి తన పేరు మీద మాటిగేజ్ చేయాలని చెప్పి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన దర్గాల అశోక్ అనే వ్యక్తికి లోన్ ఇప్పిస్తానని చెప్పి అతనికి చెందిన 10 గుంటల పొలం మార్టగేజ్ పేరుతో తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. లోన్ ఇప్పించకపోవడంతో అశోక్ తన పొలం కాగితాలు ఇవ్వాలని నిలదీయడంతో తన మేనత్త భర్త యాపచెట్టు లస్మన్నకు రూ.10 లక్షలు లోన్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి 18 గుంటల భూమిని మార్టగేజ్ చేయాలని నమ్మించి.. దర్గాల అశోక్ పేరుమీద రిజిస్ట్రేషన్ చేశాడు. కొన్ని నెలలు గడిచినా లస్మన్నకు లోన్ ఇవ్వక పోవడంతో అతను తన పొలానికి సంబంధించిన పత్రాలు ఇవ్వాలని నిలదీయడంతో ప్రశాంత్‌యాదవ్ చేస్తున్న మోసాలు బయటపడ్డాయి. దీంతో ఆగ్రహానికి గురైన లస్మన్న కుటుంబ సభ్యులు ప్రశాంత్‌కు చెందిన ఇంట్లో పైభాగంలో ఉంటూ తమకు భూమి పత్రాలు ఇస్తేనే ఇల్లు ఖాళీ చేస్తామని, ఏడాది కాలంగా నివాసం ఉంటున్నారు. ఇలా మోసాల మీద మోసాలు చేస్తూ తిరుగుతున్న ప్రశాంత్ చరిత్ర రాచర్ల ప్రసాద్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను హత్య చేయడంతో ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. మరికొంతమంది కూడా మోసపోయి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### మాకు తెలియకుండా భూమి రాసుకున్నడు..



ప్రశాంత్‌యాదవ్ మా బంధువే. మా నాన్న లస్మన్నకు రూ. 10లక్షల లోన్ ఇప్పిస్తానని చెప్పి 18గుంటల భూమిని మాకు తెలియకుండానే మరొకరి పేరు మీద రిజిస్ట్రేషన్ చేశాడు. లోన్ కోసం నిలదీయడంతో అసలు విషయం తెలిసింది. మా పొలాన్ని మాకు తిరిగి ఇప్పించాలి.

**- సావిత్రి, బాధితురాలు, మాక్లూర్**

### ఒక్కరినీ మిగలకుండా చేశాడు..



మా కుటుంబానికి చెందిన ఆరుగురిని హత్య చేయడంతో మేము దిక్కులేని వాళ్లమయ్యాం. నా అల్లుడు ప్రసాద్, భార్య రమణి, ఇద్దరు కోడళ్లు, ఆభం, శుభం తెలియని ఇద్దరు చిన్నారులను అతి దారుణంగా హత్య చేశాడు. వాడికి తగిన శిక్ష పడేలా చూడాలి.

**గంగామణి, ప్రసాద్ మేనత్త, మాక్లూర్**

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

B.PEd Rs.20,000/- Yearly (2023-24)
SRI RAGHAVENDRA B.PED College (T.U)
Armoor, 9440090131

CHANGE OF NAME
I, GOLLAPALLY SWAMI GOUD S/o. GOLLAPALLY BHOOMA GOUD, H.No. 4-7-96, Jammanjetty gally, Armoor, (D) Nzb Changed my name as GOLLAPALLY SWAMY GOUD

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

WANTED
★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.